క్లుప్తంగా

కార్మెల్ మాతకు పూజలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్ మాతను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆదివారం తరలి వచ్చారు. బాల ఏసుదేవాలయంలో దివ్య పూజాబలి సమర్పించారు. తలనీలాలు ఇచ్చి కార్మెల్‌మాతను దర్శించుకొని కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించండి



తాడేపల్లి రూరల్: పాలకులు ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలోని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులపై పాలక పార్టీలు ఏ దృక్పథంతో ఉంటాయో సిమెంట్ ఫ్యాక్టరీ సమస్య చూస్తే అర్థమవుతుందన్నారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదని విమర్శించారు. నేతలు తుపాకుల నాగేశ్వరరావు, సాంబశివరావు, సుబ్బారావు, బాషా, కార్మికులు నవనీతమ్మ, సూర్యప్రకాష్, దుర్గా భవాని, ఇమాంబి, శారద, సారమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కంచర్ల సంస్మరణ సభ



తాడేపల్లి రూరల్: కంచర్ల పద్మారావు సంస్మరణ సభను సీపీఐ నాయకులు ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండలో నిర్వహించారు. తొలుత పద్మారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు సీపీఐ నాయకులు మాట్లాడుతూ పార్టీ నిర్వహించిన అనేక పోరాటాల్లో కంచర్ల పద్మారావు చురుగ్గా పాల్గొనేవారన్నారు. జై ఆంధ్ర ఉద్యమంలో పాల్గొని రౌడీమూకలకు వ్యతిరేకంగా నిలబడ్డారని, వర్గపోరులో ఆయన అమరుడయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, న్యాయవాది గౌతమ్ రెడ్డి, విజయవాడ బార్ అసోసియేషన్ నాయకులు, సీపీఐ మంగళగిరి మండల అధ్యక్షుడు జాలాది జాన్‌బాబు, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, లచ్చి తులసిదాసు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులతో ఇక్కట్లు



ఫిరంగిపురం: గుంటూరు, కర్నూలు రహదారి వేమవరం అడ్డరోడ్డు నుంచి మేరికపూడి గ్రామ శివారు వరకు రహదారి పక్కగా పశువులు ఉండటంతో ఇబ్బందికరంగా మారుతోంది. గడ్డి మేయడం కోసం చీకటి పడేంతవరకు పశువులను వాటి యజమానులు అక్కడే ఉంచుతున్నారు. తర్వాత పశువులు ఇంటికి వెళ్లడానికి ఒక్కసారిగా రహదారిపైకి వస్తున్నాయి. అటుగా వెళ్లే ద్విచక్ర వాహనచోదకులు వాటిని తప్పించే యత్నంలో కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికే వీటితో ప్రమాదాలు జరిగి కొందరు గాయపడగా.. కొన్ని ఘటనల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. వీటిని రోడ్డుపై ఉంచకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

డొంకరోడ్లు బురదమయం

చిర్రావూరులో పంటపొలాలకు వెళ్లాలంటే రైతులకు నరకమే



చిర్రావూరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వెనుక కృష్ణానది ఒడ్డుకు వెళ్లే డొంకరోడ్డులో ఇరుక్కుపోయిన ఆటోను లాక్కువస్తున్న ట్రాక్టర్

తాడేపల్లి రూరల్: పంట పొలాలకు వెళ్లే డొంకరోడ్లు బురదమయంగా మారి నరకానికి నకళ్లుగా కనిపిస్తున్నాయి. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో వ్యవసాయానికి, పాడిపరిశ్రమకు ప్రసిద్ధి పొందిన చిర్రావూరులో రైతాంగానికి తిప్పలు తప్పడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా ఆ రోడ్డు బురదమయంగా మారి రైతులకు శాపంగా మారింది.

తిప్పలే..

రెండు రోజుల నుంచి కురుస్తున్న తేలికపాటి వర్షాలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వెనుక భాగంలో కృష్ణానదిలోకి వెళ్లే రెండు కిలోమీటర్ల ఈ డొంకరోడ్డు బురదబురదగా కనిపిస్తోంది. చిర్రావూరులోని పంటపొలాల్లో రైతులు వరితోపాటు ప్రజలకు నిత్యం అవసరమయ్యే కూరగాయలు, అరటి ఇతర వాణిజ్యపంటలైన పసుపు, కంద పంటలను పండిస్తూ ఉంటారు. ఈ డొంకరోడ్డును కలుపుతూ మరో నాలుగు దారులు ఉన్నాయి. మొత్తం ఈ రోడ్లలో 500 ఎకరాలు ఉండగా 50 నుంచి 60 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు.

ఆటో వెళ్తే ట్రాక్టర్‌తో తీసుకురావాల్సిందే..

కూరగాయలను ప్రతిరోజూ ఆటోల ద్వారా విజయవాడ, గుంటూరు మార్కెట్లకు తరలించాల్సి ఉంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న చిరుజల్లులకు ఆటోలు లోపలకు తీసుకెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా సాహసం చేసి ఆటోను తీసుకు వెళితే దాన్ని ట్రాక్టర్ ఇంజన్‌కు కట్టి బయటకు తేవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలీలకు ఇచ్చే నగదుతో పాటు ట్రాక్టర్‌కు కూడా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. రెండు రోజులుగా ఆ ప్రాంతంలో రైతులు డొంక రోడ్డులోకి ట్రాక్టర్‌ను తీసుకువెళ్లి.. ఇతర డొంక రోడ్లలో కూలీలను పెట్టి కూరగాయలు మోయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌లో కూరగాయల రేట్లు ఆకాశానికి అంటుతుంటే రైతుల వద్ద మాత్రం అరకొర పైసలు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. గిట్టుబాటు ధరలు లేక, కూలీలకు డబ్బులు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. ఎరువు కట్టలు మోసుకు వెళ్లాలంటే బస్తాకు యాభై నుంచి 100 రూపాయలు ఇవ్వాల్సి వస్తోందని రైతులు తెలిపారు.



డొంక రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..

వెంటనే రోడ్డు నిర్మించాలి



చిర్రావూరు అంబేద్కర్ విగ్రహం వెనుక ఉన్న డొంక రోడ్డులో 500 ఎకరాలకు పైగా పంట పొలాలు ఉన్నాయి. వీటిలో రైతులు పాడిపశువులను పెంచుకుంటున్నారు. కూరగాయలు పండిస్తున్నారు. ప్రతిరోజూ పొలానికి వెళ్లాల్సి ఉంటుంది. కూరగాయలు మార్కెట్‌కు తరలించాలన్నా, పాడిపశువుల నుంచి పాలు తెచ్చుకోవాలన్నా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రభుత్వం ఈ డొంకరోడ్డును నిర్మించి రైతులను ఆదుకోవాలి.

–ఎం. సుహాస్, సీపీఐ

ప్రజా సంఘాల్లో కళాకారులు తయారుకావాలి

తాడేపల్లి రూరల్: ప్రజా సంఘాల్లో కళాకారులు తయారు కావాలని సీఐటీయూ జిల్లా నేత వై.నేతాజీ అన్నారు. తాడేపల్లి పట్టణపరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో ఆదివారం ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు, సన్యాసిరావు సంస్మరణ సభను నిర్వహించారు. తొలుత ప్రజా నాట్యమండలి గుంటూరు జిల్లా నాయకులు ఆర్వీ రాఘవయ్యతో కలసి ఆయన రాజారావు, సన్యాసిరావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ మాట్లాడుతూ యువతీ యువకులను కళారంగం వైపు తీసుకురావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాలకు సౌకర్యాలు లేని ఆ రోజుల్లో, మోకాలి లోతు బురదలో వెళ్లి ప్రజలను కళారూపాల ద్వారా చైతన్యవంతం చేసిన డాక్టర్ గరికపాటిరాజారావు, సన్యాసిరావు ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, గాదె సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, నారిన నాగేశ్వరరావు, మేరీ, బర్నబాస్, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, బాబూరావు, రామారావు, ఏసయ్య తదితరులు పాల్గొన్నారు.



గరికపాటి రాజారావు, సన్యాసిరావు చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ప్రజా సంఘాల నేతలు

ఫొటోగ్రాఫర్ శివకుమార్‌కు సన్మానం



పెదవడ్లపూడి(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి(ఎంటీఎంసీ) పరిధిలోని పెదవడ్లపూడికి చెందిన ఫొటోగ్రాఫర్ గోలి వెంకట శివకుమార్‌ను గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అన్నే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సత్కరించారు. వెంకట శివకుమార్ 30 ఏళ్ల నుంచి స్టూడియో నడుపుతున్నాడు. సామాజిక స్పృహతో కూడిన కళాత్మక ఫొటోలు తీసి అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం అభినందనీయమని కొనియాడారు. శివకుమార్ 256 ఇంటర్నేషనల్ అవార్డులు, 36 గోల్డ్ మెడల్స్, 9 నేషనల్ హానర్స్ సాధించారని తెలిపారు. కార్యక్రమంలో చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, జువ్వాది ఆంజనేయులు, గడ్డిపాటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన స్కిల్ పలావర్

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యాన ఆదివారం విద్యార్థులకు స్కిల్ పలావర్ నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ స్కిల్ పలావర్ మూడు దశల్లో వేర్వేరు సమయాల్లో ఆయా విభాగాల విద్యార్థుల సమూహాలను లక్ష్యంగా చేసుకుని నిర్వహించామని తెలిపారు. ప్రతి దశలో మూడు ముఖ్యమైన భాగాలు ఉన్నాయని, వాటిలో లెర్నథాన్, ఆన్‌లైన్ రివ్యూ, హ్యాకథాన్ అని, ఈ నమూనా ప్రకారం విద్యార్థులకు ప్రగతిశీల విద్యా ప్రయాణాన్ని అందిస్తున్నామన్నారు. స్కిల్ పలావర్ మూడో దశలో విద్యార్థులు 10 ప్రధాన సవాల్ రంగాల్లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమాన్ని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాజేష్, సీఎస్ఈ, ఈసీఈ, ట్రిపుల్ ఈ, ఏడీ డీఎస్, సీఎస్ఐటీ, సీఈ విభాగాలు, వాటి అనుబంధ విభాగాల విభాగాధిపతులు, స్పోక్‌లు సమన్వయం పరిచారు. వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ రాజశేఖరరావు తదితరులు పర్యవేక్షించారు.



స్కిల్ పలావర్ ప్రాజెక్టును విద్యార్థులకు వివరిస్తున్న కేఎల్‌యూ ఆచార్యులు

మూడు నెలలకొకసారి శిక్షణ శిబిరాలు



మంగళగిరి టౌన్: మూడు నెలలకొకసారి టెక్నీషియన్లకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని ప్రైవేట్ మెడికల్ లేబొరేటరీ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీహరి తెలిపారు. నవ్యాంధ్రప్రదేశ్ ప్రైవేట్ మెడికల్ లేబొరేటరీ ప్రొఫెషనల్ అసోసియేషన్ లోగోను సినీ ప్రముఖుడు డాక్టర్ గౌతమ్ రాజు ఆదివారం ఆవిష్కరించారు. మంగళగిరి నగర పరిధిలోని ఆర్ ఆర్ కన్వెన్షన్‌లో అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యనిర్ధారణ పరీక్షలు అందించడం ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. కొన్ని కార్పొరేట్ కంపెనీలు ఆన్‌లైన్‌లో ప్యాకేజీల పేరుతో మోసపూరిత ప్రకటనలు చేస్తున్నాయని, ప్రజల ఆరోగ్యాన్ని వ్యాపార సాధనంగా మార్చుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు లేబొరేటరీలకు ఆరోగ్యశ్రీలో భాగస్వామ్యం కల్పిస్తే రాష్ట్రంలోని 20 వేల ల్యాబ్‌లు, వారి కుటుంబాలు జీవనోపాధి పొందే అవకాశం ఉంటుందని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అడ్వయిజరీ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి, అసోసియేషన్ జనరల్ సెక్రటరి దుర్గాప్రసాద్, కోశాధికారి నారాయణరావు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్లు, జాయింట్ సెక్రటరీలు, జిల్లా, మండల, పట్టణ స్థాయి అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడాకారులను తీర్చిదిద్దుతాం

తాడేపల్లి రూరల్: రాష్ట్రం నుంచి క్రీడాకారులను తీర్చిదిద్దనున్నట్లు ఇస్కా స్పోర్ట్స్ ఫౌండర్ సునీల్ చెప్పారు. తాడేపల్లి రూరల్ పరిధి కొలనుకొండలోని ఓ బహుళ అంతస్తుల భవనంలో ఆంధ్ర క్వెస్ట్ ఫర్ ఒలంపిక్ గోల్డ్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇస్కా స్పోర్ట్స్ ఫౌండర్ సునీల్ మాట్లాడుతూ క్రీడల్లో నాలుగు రంగాలను అభివృద్ధి చేస్తే 2036లో జరిగే ఒలింపిక్స్‌లో ఏపీ నుంచి బంగారు పతకం సాధించేందుకు అవకాశం ఉందన్నారు. క్రీడాభారతి ప్రభుత్వం సహకారంతో కొన్ని క్రీడలను దత్తత తీసుకుని ప్రైవేటు సెక్టార్‌తో కలసి క్రీడాకారులను తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి ఖోఖో, కబడ్డీ, ఫుడ్ బాల్, వాలీబాల్, బాస్కెట్ బాల్, జిమ్నాస్టిక్స్ వంటి క్రీడల్లో పాల్గొనేందుకు ఒక డిజైన్ చేయడానికి సెమినార్ నిర్వహించామని తెలిపారు. క్రీడలకు సంబంధించిన ప్రముఖుల సలహాలతో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నామని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అలయెన్స్‌గా ఉండటంతో క్రీడలను మరింత ముందుకు తీసుకెళ్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్రీడా భారతి జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ జుగుదర్, క్రీడా భారతి ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ ధనుంజయ్‌రెడ్డి, బాలలత సీఐడీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇస్కా స్పోర్ట్స్ ఫౌండర్ సునీల్

సేవలకు సత్కారం



దుగ్గిరాల: ఇండస్ట్రీస్, సొసైటీలకు అందించిన సేవలకు రాజేంద్రప్రసాద్‌కు జీవన సాఫల్య పురస్కారం లభించడం అభినందనీయమని దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ అన్నారు. ఆదివారం దుగ్గిరాల మండలం మంచికలపూడిలోని కాంటినెంటల్ కాఫీ ఇండియా లిమిటెడ్‌లో సంస్థ చైర్మన్ చల్లా రాజేంద్ర ప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో గద్దె శ్రీనివాసరావు, ఈఓ వివేకానంద పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

మంగళగిరి: పట్టణంలోని ముక్తినాథ్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆరుద్ర బోయరాజు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం తులసివనం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మున్నంగి శివశేషగిరావు, సుఖమంచి గిరిబాబు, పి.నాగరాజు, తాడిబోయిన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైరల్ జ్వరాల విజృంభణ



పట్టణంలో మురుగు కాలువల్లో తరచూ నిలుస్తున్న మురుగు

- కొరవడుతున్న పారిశుద్ధ్యం
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

మంగళగిరి: నియోజకవర్గంలో ప్రజలు వైరల్ ఫీవర్స్ మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలతో విలవిలాడుతున్నారు. ప్రభుత్వాస్పత్రులు, మూడు అర్బన్ పీహెచ్‌సీలు జ్వరపీడితులతో కనిపిస్తున్నాయి. వారికి సరైన వైద్య సేవలందించకపోవడంతో గుంటూరు విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ రోగులు తిరుగుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇంటి వద్దే నాణ్యమైన వైద్య సేవలందించేందుకు నగరంలో 9 అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించి ఆయా కేంద్రాల్లో పది పడకలతో పాటు అన్ని వసతులు కల్పించింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం ప్రభుత్వాస్పత్రులతో పాటు అర్బన్ పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండకపోగా కనీస సౌకర్యాలు కనుమరుగయ్యాయి. రోగులు వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ పేదలు అప్పులపాలు కావాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు ప్రభుత్వాస్పత్రులతో పాటు అర్బన్ పీహెచ్‌సీలకు ప్రతి రోజూ జ్వరంతో 100 నుంచి 130 మంది వస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కదలని మురుగు

స్థానికంగా కాలువల్లో మురుగు పారుదలకు తీసుకుంటున్న చర్యలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. మురుగు ముందుకు కదలకపోవడంతో కాలువలు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. దోమలు కట్టి వ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముందస్తు చర్యల్లో తాత్సారం

ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. జ్వరాలు పెరిగి ప్రజలు ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుండగా నెమ్మదిగా శనివారం వైద్యులు స్లమ్ ఏరియాలలో రక్త పరీక్షలు చేయడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టి సారించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మంగళగిరిలో భారీ వర్షం



ఇందిరానగర్‌లో నిలిచిన వర్షం నీరు

మంగళగిరిటౌన్: మంగళగిరిలో ఆదివారం మధ్యాహ్నం ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియడంతో జనజీవనం స్తంభించింది. డ్రైన్లు పొంగి పొర్లాయి. రహదారులు కాలువలుగా మారాయి. నగర పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు వర్షం ప్రభావంతో జలమయమయ్యాయి. టిడ్కో గృహ సముదాయంలో నీళ్లు నిలిచాయి. చిన్నపాటి వర్షానికే టిడ్కో గృహ సముదాయం అంతా మోకాలి లోతు నీరు రావడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందిరానగర్ రోడ్లు నీట మునిగాయి.



మంగళగిరిలో నిలిచిన నీరు